# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | సోమవారం 18 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 160

తెలుగు దినపత్రిక


## మొదటి రోజు సాఫీగా..




- ప్రారంభమైన గ్రూప్ 3 పరీక్షలు..
- అడ్డంకులు లేకుండా రెండు పేపర్లు
- అరగంట ముందే గేట్లు క్లోజ్ చేసిన అధికారులు..

2

## వరిలో రికార్డు..

**దిగుబడిలో తెలంగాణ టాప్..**



- 66.77 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి
- ముమ్మాటికీ మాది రైతు పక్షపాతి ప్రభుత్వమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అన్నదాతలందరికీ అభినందనలు..
- మీ కష్టం వెలకట్టలేనిది..
- సీఎం రేవంత్ రెడ్డి

4

## చస్తున్నా.. చలనం రాదా...?



- యువతను కాపాడే బాధ్యత ప్రభుత్వానికి కదా..?
- గురుకులాల్లో విద్యార్థుల మృత్యు ఘోష
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం
- దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచన..

4



## బాధితులకు బాసటగా..

**లగచర్ల ఘటనపై ప్రజా సంఘాలు సీరియస్**

**జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు**

**బాధితులను ఆదుకోవాలని వినతి..**

**జనపదం, న్యూఢిల్లీ:**

లగచర్ల ఘటనపై ప్రజా సంఘాలు సీరియస్ అయ్యాయి. ఈ మేరకు ఆదివారం లగచర్ల బాధితులను ప్రజా సంఘాల నాయకులు ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను లగచర్ల బాధితులు కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తో కలిసి బాధితులు ఢిల్లీలోని ఎస్సీ, ......(తరువాయి 2లో)

## మూసీల బొర్లుతాండ్లు..

### నది ప్రక్షాళనపై ముష్టి యుద్ధం..

- నేతల వాదనంతా దాని చుట్టే..
- మహారాష్ట్ర వేదికగా హస్తం.., కమలం.. సిగపట్లు..
- దుమ్మెత్తిపోసుకుంటున్న కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి
- అవకాశం చూసి విరుచుకుపడుతున్న పార్టీలు..



**జనపదం, బ్యూరో**

అటు తిరిగి, ఇటు తిరిగి ఆఖరుకు మూసీ వైపు మళ్లింది. రాజకీయం అంతా మూసీ కేంద్రంగా పొర్లు తున్నది. అప్పుడెప్పుడో హైడ్రాతో రగులుకున్న రవ్వకు బీఆర్ఎస్ మరింత వత్తి అంటించడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ తర్వాత కొద్దికొద్దిగా చెలరేగుతూ ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే స్థాయికి ఎగశాయి. మూసీ నిద్రంటూ కమలం నేతలు హడావుడి చేస్తుంటే.., నిద్ర చేయగానే సరిపోదు మూసీ నీళ్లతో స్నానం కూడా చేయాలని హస్తం నేతలు సవాళ్లు విసిరారు. మహారాష్ట్ర రాజకీయాల్లో మూసీ కూడా కీలక భూమిక పోషించేలా ఎదిగిందంటే అది ఆ రెండు పార్టీల చొరవే అని చెప్పాల్సిందే. పేద ప్రజల పక్షాన పోరాడుతున్నామని చెప్పుకోవడానికా.., లేదంటే నిజంగా వారి ప్రయోజనాలు కాపాడడానికి అన్న విషయమై ఇప్పటికిప్పుడు ......(తరువాయి 2లో)

నాయకులంతా మూసీల బొర్లుతాండ్రు. మేం పూసుకుంటమంటే.., మేం పూసు కుంటమని పోటీపడుతాండ్రు. ఎక్కడ క్రెడిట్ పక్కోడు ఎగరేసుకుపోతడో అని ఎగిరెగిరిపడుతున్నరు. ఎంత పూసుకుంటూ అంత పనిచేస్తున్నట్టుగా భావించి పోటాపోటీగా అంటించుకుం టున్నరు. అక్కడ కాదు., ఇక్కడ కాదు., ఏకంగా పక్కరాష్ట్రమైన మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కూడా మూసీ ముచ్చట్లతోనే జనాలను వశపర్చుకోవ డానికి శతథా ప్రయత్నాలు చేస్తున్నరు. ఆ ప్రక్షాళనేంటో.., అందుకు కాంగ్రెస్ సర్కార్ ప్లానేంటో.., అది ఎప్పటికి పూర్త వుతుందో.. గానీ ఇప్పుడైతే బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం ఉతికి ఆరే స్తున్నాయి. మరీ ముఖ్యంగా కమలం పార్టీ నేతలైతే ఏకంగా నిద్ర అంటూ ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఇక్కడి పేదలను ప్రసన్నం చేసుకోవడంతో పాటు దానిని అక్కడ కూడా ప్రచారం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

### వారెవ్వా.. తోడు దొంగల నాటకం..

**రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా కమలదళం**

**ఎక్స్ వేదికగా కేటీఆర్ ధ్వజం..**

ఇన్నాళ్లకు మూసీ బాధితుల ఆక్రందనలు గుర్తొచ్చాయా.. అని విమర్శ..

4

### ఓట్ల కోసమే బీజేపీ నేతల మూసీ నిద్ర

**కాంగ్రెస్ పై నిందలు వేస్తే మహారాష్ట్రలో ఓట్లు వస్తాయని ఆశ**

**బస చేసేందుకు ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ అవసరమా అని మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా**



### ప్రజలపై యుద్ధం వద్దు..

- తులసీరాం నగర్ లో దుర్గంధం లేనేలేదు..
- మూసీ ప్రక్షాళన చేస్తానంటే నా జీతం ఇస్తా..
- రేవంత్ మళ్లీ సీఎం ఇంపాసిబుల్...
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ముగిసిన మూసీ నిద్ర..



### రాష్ట్రంలో ఆర్కే ఫ్యామిలీ పాలన

- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేటీఆర్ ఒప్పందం
- ఇక ఆయన అరెస్టు అటకెక్కినట్లే..
- రేవంత్ సర్కార్ చేతకానితనంతోనే కేటీఆర్ నటన..
- తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని నిషేధించాల్సిందే..
- కేంద్రమంత్రి బండి సంజయ్

2

### నేటి నుంచి నూతన ఈవీ పాలసీ..

- ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మిన హాయింపు
- రేపటి నుంచి అమల్లోకి..
- హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నాం..
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

3

### చుక్కలు చూపుతున్న సురేశ్..?



- సవాలు మారిన లగచర్ల ఘటన ప్రధాన నిందితుడి ఆచూకీ
- గాలిస్తున్నా.. చిక్కట్లే...
- తప్పిస్తున్నది ఎవరు అనేది అంతుచిక్కని ప్రశ్న..
- పక్కా ప్రణాళిక ప్రకారమేనా అనే అనుమానాలు..
- పోలీసులకు ముచ్చెమటలు

4

### కమలమోళ్ల కండ్లకు పొరలు..

- మూసీ ప్రక్షాళన బీజేపీకి ఇష్టం లేదు
- గుజరాత్ గులాం.. కిషన్ రెడ్డి..
- పార్టీ ఆయనను వాడుకుంటోంది
- సబర్మతి ప్రక్షాళనప్పుడు ఎందుకు మాట్లాడలేదు..?
- ఎవరు అడ్డుకున్నా పునర్జీవం ఆగదు
- మహారాష్ట్రను దోచుకునేందుకు గుజరాతీలు వస్తున్నారు
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

4



## గాలికొదిలిండ్రు..

- పక్కరాష్ట్రానికి పరుగులు పెడుతున్న నేతలు..
- సీఎం సహా మంత్రులంతా అక్కడే మకాం...
- ఎన్నికల ప్రచారంలో బిజీబిజీ..
- ఇప్పటికే సీఎం మూడు సార్లు..
- ప్రస్తుతం డిప్యూటీ సీఎం, ఉత్తమ్., కోమటిరెడ్డి అక్కడే..

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:**

“ఉన్నకాడ ఏడపోతేంది.., కొత్తకాడ మాత్రం ఏతులకు పోవాల్సిందే. నమ్ముకున్నోళ్లు ఏట్ల కొట్టుకుపోయినా పర్లేదు., పైనున్నోళ్ల ప్రసన్నం మాత్రం జరిగి తీరాలే..” ఇది రాష్ట్రంలోని సర్కార్ పెద్దల వ్యవహార శైలి. ఓ పక్క రాష్ట్రంలో లెక్కలేనన్ని సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రజలేమో కష్టాల్లో కూరుకుపోయి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓట్లేసి గెలిపించుకున్న పెద్దలు రాకపోతరా.., తీర్చకపోతరా.. అని గంపెడా శతో బిక్కుబిక్కున కాలం గడుపుతున్నారు. కానీ మన రాష్ట్ర పెద్దలు, సర్కారు పాలనను గాలికి వదిలి., ఎంచక్కా మహారాష్ట్రలో వెళ్లి లెక్చర్లు దంచుతున్నారు. ఇక్కడ కాలిబూడిదవ్వని గాక, అక్కడేదో ఎత్తిపోయినట్టుగా పర్యటనల మీద పర్యటనలు చేస్తూ పత్రికలకెక్కుతున్నారు.

**దండయాత్రే..**

ఎంకిపెండ్లి సుబ్బి సావుకొచ్చినట్టుగా., మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు తెలంగాణ ప్రజల సావుకొచ్చిపడ్డట్టే అవుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ సహా మంత్రులంతా ఎలక్షన్స్ ప్రచారానికి వరుసగడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు తలకు మించిన సమస్యలతో రాష్ట్ర ప్రజలు సర్కార్ సాయం కోసం ఎదురు చూస్తుండగా, ప్రభుత్వ పెద్దలు ఇవేమీ పట్టవు అన్నట్టుగా నింపాదిగా ఎన్నికలు ......(తరువాయి 2లో)



## విశ్వసుందరిగా డెన్మార్క్ బ్యూటీ

జనపదం, బ్యూరో : మిస్ యూనివర్స్ పోటీల్లో డెన్మార్క్‌కు చెందిన 21 ఏళ్ల విక్టోరియా కెజార హెల్విగ్ విజేతగా నిలిచింది. మెక్సికో వేదికగా జరిగిన మిస్ యూనివర్స్ 2024 పోటీల్లో 125 మంది పోటీ పడగా విక్టోరియా విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన మిస్ యూనివర్స్ 73వ ఎడిషన్ పోటీల్లో విజేతగా నిలిచిన విక్టోరియాకు 2023 మిస్ యూనివర్స్ షెన్నిస్ పలాసియోస్ విశ్వసుందరి కిరీటాన్ని అలంకరించింది. ఈ పోటీల్లో నైజీరియాకు చెందిన చిడిమ్మ అడెట్షినా మొదటి రన్నరప్‌గా నిలిచింది. మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండా బెల్ట్రాన్ రెండో రన్నరప్‌గా నిలిచింది. ఈ మిస్ యూనివర్స్ 2024 గ్రాండ్ ఫినాలేలో భారత్‌కు చెందిన రియా సింఘా కూడా పాల్గొంది. అయితే ఆమె టాప్ 30లోనే ఆగిపోయింది. ఈసారి మిస్ యూనివర్స్ పోటీల్లో టాప్-12లో ఏడుగురు లాటిన్ అమెరికా దేశాలకు చెందినవారే.

## బాధితులకు బాసటగా...

**(మొదటిపేజీ తరువాయి)** ఎస్టీ కమిషన్ తో పాటు మానవహక్కుల కమిషన్ ను కలిసి ఫిర్యాదు చేశారు. లగచర్ల ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే బాధిత కుటుంబాలను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫార్మా సిటీ భూసేకరణకు సంబంధించిన విషయంలో పోలీసులు దురుసు ప్రవర్తన, రైతుల వద్ద నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తూ ప్రాథమిక హక్కులను హరిస్తున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. రైతులపై అఘాయిత్యానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను ప్రజా సంఘాలు కోరాయి.

## టైకాన్ సదస్సుకు రండి..!

### మాజీ మంత్రి కేటీఆర్ కు ఆహ్వానం



**జనపదం, హైదరాబాద్ :** ప్రతిష్టాత్మక టైకాన్ కేరళ 2024 సదస్సుకు గౌరవ అతిథిగా హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఆహ్వానం అందింది. ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ నిర్వహణలో వచ్చే నెల 4,5 తేదీల్లో కొచిన్‌లోని గ్రాండ్ హయత్ హోటల్‌లో ఈ సదస్సు జరుగనుంది. కేరళ రాష్ట్రం లోనే అతిపెద్ద ఈవెంట్ గా పేరు ఉన్న13వ టైకాన్ కు వివిధ రంగాల సీఈవోలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పరిశ్రమ నిపుణుల వంటి 1,000 మందికి పైగా పాల్గొననున్నారు. ఈ ఏడాది థీమ్, 'మిషన్ 2030 – ట్రాన్స్‌ఫార్మింగ్ కేరళ', కేరళ ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించేందుకు అవసరమైన ప్రణాళికలను వ్యూహాలను ఈ సదస్సు చర్చించనున్నది. డిసెంబర్ 5, 2024 న సాయంత్రం 4 గంటలకు జరిగే టైకాన్ అవార్డ్స్ ముగింపు వేడుకలకు కేటీఆర్ ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిలో ఆయన చూపిన గొప్ప నాయకత్వం, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లను తెలంగాణలో పెంపొందించడంలో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, అనుసరించిన వ్యూహాలు, కేటీఆర్ ఆలోచనలు ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి గొప్ప స్ఫూర్తిని కలిగిస్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 58 శాతం పూర్తయిన ఇంటింటి సర్వే

**జనపదం, బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే 2024) విజయవంతంగా సాగుతోంది. అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే దేశమందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నవంబర్ 6న ప్రారంభమైన ఈ సర్వే.. 12 రోజుల్లోనే సగానికిపైగా పూర్తయింది. ఆదివారం (నవంబర్ 17) నాటికి 58.3% సర్వే పూర్తయింది. సర్వేలో ముందుగా నవంబర్ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఇళ్ల గణనను ప్రభుత్వం చేపట్టింది. సర్వేలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 1,16,14,349 ఇళ్లను గుర్తించింది. నవంబర్ 9వ తేదీ నుంచి ఇంటింటి వివరాల సర్వే ప్రారంభించింది. మొత్తం రాష్ట్రంలో ఇప్పటివరకు 67,72,246 గృహాల సర్వే పూర్తయింది.

| 17 నాటికి సర్వే పూర్తయిన ఇండ్లు: | ఎన్యుమరేటర్లు |
|---|---|
| గ్రామీణం: 64,41,183 | గ్రామీణం: 47,561 |
| పట్టణం: 51,73,166 | పట్టణం: 40,246 |
| మొత్తం: 1,16,14,349 | మొత్తం: 87,807 |
| బ్లాకులు: | పర్యవేక్షకులు.. |
| గ్రామీణం: 52,493 | గ్రామీణం: 4,947 |
| పట్టణం: 40,408 | పట్టణం: 3,841 |
| మొత్తం: 92,901 | మొత్తం: 8,788 |

## 27న ఉద్యమకారుల మహా పాదయాత్ర

**జనపదం, గోదావరిఖని:** తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈనెల 27న కరీంనగర్ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ తెలిపారు. గోదావరిఖనిలోని అమృత ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న మహా పాదయాత్ర కరీంనగర్ నుండి వేములవాడకు స్వామి వారికి మొక్కులు సమర్పించడం జరుగుతుందని తెలిపారు.

# రాష్ట్రంలో ఆర్కే ఫ్యామిలీ పాలన

- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేటీఆర్ ఒప్పందం
- ఇక ఆయన అరెస్టు అటకెక్కినట్లే..
- రేవంత్ సర్కార్ చేతకానితనంతోనే కేటీఆర్ నటన..
- తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని నిషేధించాల్సిందే..
- కేంద్రమంత్రి బండి సంజయ్



**జనపదం, సంగారెడ్డి:** రాష్ట్రంలో ఆర్కే (రేవంత్, కేసీఆర్) ఫ్యామిలీ పాలన నడుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆ రెండు కుటుంబాల మధ్య వ్యాపార సంబంధాలు ఉన్నాయన్నారు. ఆధారాలతో సహా తాను నిరూపించేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. అయితే తనకు , సీఎం రేవంత్ తో వ్యాపార సంబంధాలు ఉన్నట్లు బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలలో నిజం లేదని బండి సంజయ్ అన్నారు. తమ మధ్య వ్యాపార సంబంధాలు ఉన్నట్లు బీఆర్ఎస్ నేతలు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానిని బండి సంజయ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.. లగచర్ల ఘటన సహా అనేక స్కామ్ లలో ప్రమేయం ఉన్నప్పటికీ మాజీ మంత్రి కేటీఆర్ ను అరెస్టు చేసే అకాశాలు లేవని అన్నారు. ఇప్పటికే ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ అన్ని ఒప్పందాలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. వాళ్ళకు చేయాల్సింది అంతా కేసీఆర్ చేశారన్నారు. ఇక కేటీఆర్ అరెస్ట్ కథ అటకెక్కినట్లేనని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో విధ్వంసం సృష్టించి, రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. అందుకోసం ప్రజల ప్రాణాలను బలిపెట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళన, కానిస్టేబుళ్ల ఆందోళనలో బీఆర్ఎస్ నేతలు విధ్వంసం సృష్టించేందుకు యత్నించారని అన్నా రు. రైతుల ముసుగులో దాడులకు పాల్పడుతోంది కూడా బీఆర్ఎస్ నేతలేనని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ను నిషేధించాల్సిన అవసరం ఉందన్నా రు. తనకు ఆరోగ్యం సహకరించక రెండురోజులు పాటు బయటకు రాలేకపోయాని చెప్పారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బండి సంజయ్ ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారని, తాను వాళ్ళకు కలలో కూడా కనిపిస్తూనే ఉన్నాని అన్నారు. రైతుల సమస్యల గురించి మాట్లాడని బీజేపీ నేతలు అడుగుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నాయని ఆయన విమర్శించారు. లగచర్ల దాడులకు, రైతులకు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. రైతులు కష్టాలు చెప్పుకుంటే దానిపై చర్చించకుండా, కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా జనంలో చర్చ పెడతారా? అని బండి సంజయ్ నిలదీశారు. లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతో పాటు కేటీఆర్ హస్తముందని రాష్ట్ర ప్రభుత్వమే చెబుతుందన్నారు. ప్రభుత్వ చేతకాని తనం వలన కేటీఆర్ ను అరెస్టు చేయలేకపోతున్నారని ఆయన ఆరోపించారు. కేటీఆర్ రెండ్రోజుల నుంచి టీవీలలో ఇంటర్వ్యూలు ఇస్తూ అరెస్టు చేసుకోండని నటనా చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. రేవంత్ సర్కార్ చేతగానితనం వలన కేటీఆర్ నటిస్తున్నాడని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని తేల్చినా ఎందుకు అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

# ప్రజలపై యుద్ధం వద్దు..

- తులసీరాం నగర్ లో దుర్గంధం లేనేలేదు..
- మూసీ ప్రక్షాళన చేస్తానంటే నా జీతం ఇస్తా..
- రేవంత్ మళ్లీ సీఎం ఇంపాసిబుల్...
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ముగిసిన మూసీ నిద్ర..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** "అనవసరంగా ప్రజలపై యుద్ధం ప్రకటించొద్దు., పేద ప్రజలు ఎన్నో కష్టాల్లో ఉన్నారు. ఇండ్లను కూల్చి వాళ్లను దిక్కులేని వారిగా చేయొద్దు.., నిజంగా మూసీ ప్రక్షాళనే చేయాలనుకుంటే నా జీతం కూడా ఇస్తా.." అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూసీ నదిలో సుమారు కోటి మంది ప్రజల వ్యర్థాలు కలుస్తాయని అందులోకి అవి వెళ్లకుండా ప్రత్యామ్నాయం ఆలోచించాలని కోరారు. బీజేపీ చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులు, ఇక్కడి సీనియర్ల సహకారం ఉంటే తప్ప సీఎం ఈ టర్మ్ నెట్టుకురావడమే కష్టమని, ఇక జన్మలో సీఎం కాలేదని రేవంత్ పై ఘాటుగా విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు సరైన డీపీఆర్ కూడా సిద్ధంగా లేదని, ఆ మాటకొస్తే నిధులు ఎక్కడ నుంచి తెస్తారో కూడా చెప్పాలన్నారు. హైకోర్టు పరిసరాల్లో నిజాం నవాబ్ రిటైనింగ్ వాల్ కట్టిన ఆనవాళ్లు ఉన్నాయని, అలాంటి ప్రయత్నం చేస్తే తప్పకుండా సహకరిస్తామన్నారు. సరైన ప్రణాళిక లేకుండా గుడ్డిగా నది ప్రక్షాళన అంటూ ముందుకెళ్తే ఫలితాలు తప్పకుండా తారుమారవుతాయన్నారు. ఇండ్లుకూల్చకుండా నదిని ప్రక్షాళన చేస్తానంటే తన జీతం కూడా ఇవ్వడానికి సిద్ధమని ప్రకటించారు. మూసీ నిద్రలో తులసీరాం నగర్ లో నిజంగా దుర్వాసన ఆనవాళ్లు కూడా లేవని, కావాలంటే వచ్చి చూసుకోవాలని సవాల్ విసిరారు. పేదల అభ్యున్నతే తమకు పరమావధి అని ముఖ్యమంత్రిని విమర్శించాలంటే ఎన్నోఅంశాలున్నాయని, అది తమ అబిమతం కాదన్నారు.

# ఓట్ల కోసమే బీజేపీ నేతల మూసీ నిద్ర

- కాంగ్రెస్ పై నిందలు వేస్తే మహా రాష్ట్రలో ఓట్లు వస్తాయని ఆశ
- బస చేసేందుకు ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ అవసరమా అని ఎద్దేవా
- మంత్రి శ్రీధర్ బాబు



**జనపదం, గాంధీభవన్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే, మహారాష్ట్రలో బీజేపీకి ఓట్లు పడతాయని మూసీ నిద్ర కార్యక్రమాన్ని తెలంగాణ బీజేపీ నేతలు ఎంచుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. పకడ్బందీ ఏర్పాటు చేసుకుని బీజేపీ నాయకులు మూసీ నిద్ర కార్యక్రమం చేశారని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్ లో మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు.. మూసీ నిర్వాసితుల సమస్యలు నిజంగా తెలుసుకోవాలనుకుంటే నిద్ర చేసిన బీజేపీ నేతలకు ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ అవసరమా అని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇప్పటికైనా మూసీ ప్రాంత ప్రజల సమస్యలు తెలిసి వుండవచ్చని ఆయన అన్నారు. కలుషితమైన నీరు, గాలి మధ్య దుర్భర జీవితాన్ని మూసీ ప్రాంత వాసులు గడుపుతున్నారని అన్నారు. మూసీ నిర్వాసితుల కష్టాలు తెల్వాలంటే అక్కడి వెళ్ళి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని ఆయన గుర్తు చేశారు. మూసీ ప్రాంత వాసులకు స్వచ్ఛమైన తాగునీరు, మంచి ఇల్లు, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఓట్లు వేయించుకుని గెలిచిన ప్రతిపక్ష పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారని ఆయన మండిపడ్డారు. మూసీ నదికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తే సరిపోతుందనే బీజేపీ నేతల మాటలు హాస్యస్పదంగా ఉన్నాయన్నారు, మూసీలో శాస్త్రీయంగా గోడలే కట్టాలో లేక ఇంకేమైనా చేయాలో, డీపీఆర్ లు – సలహాలు ఇవ్వాలని బీజేపీ నేతలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## మొదటి రోజు సాఫీగా..

- ప్రారంభమైన గ్రూప్ 3 పరీక్షలు..
- అడ్డంకులు లేకుండా రెండు పేపర్లు
- అరగంట ముందే గేట్లు క్లోజ్ చేసిన అధికారులు..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ 3 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అధికారులు అరగంట ముందే పరీక్ష కేంద్రం గేట్లను క్లోజ్ చేశారు. ఉదయం 9.30 తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇద్దరు, సూర్యాపేటలో 15 మంది., వికారాబాద్ లో 15, ఆదిలాబాద్ లో 20 మంది, కొత్తగూడెంలో ఏడుగురు ఇలా ఆయా జిల్లాలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు అనుమతించలేదు. కాగా, 1365 గ్రూప్ 3 సర్వీసుల పోస్టుల భర్తీకి రాత పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 10 గంటలకు పేపర్ 1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరిగింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పేపర్ 3 పరీక్ష నిర్వహించనున్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ రేపు కూడా యథావిధిగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## పుట్ట మధు హత్య కుట్రపై విచారణ చేపట్టాలి

### చల్లా నారాయణ రెడ్డి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకోవాలి
### బాధ్యులపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలి
### కమాన్ పూర్ మండల బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

**జనపదం, రామగిరి:** మంథని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుపై గతంలో జరిగిన హత్యా కుట్రపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కమాన్ పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రి శ్రీధర్ బాబుకు ముఖ్య అనుచరుడిగా కొనసాగిన చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర పోలీస్ శాఖ సుమోటో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పుట్ట మధుపై దాడి చేసేందుకు గతంలో తనను ప్రస్తుత మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు ప్రేరేపించారని, వారి ఆదేశాల మేరకు పుట్ట మధుపై దాడి చేసేందుకు వెళ్తుండగా తమ వాహనానికి యాక్సిడెంట్ జరగడంతో తనకు జ్ఞానోదయమై దాడి చేయడం వెల్లడించారని పేర్కొన్నారు. చల్లా నారాయణ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్ యాదవ్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, నీలం శ్రీనివాస్, చిందం తిరుపతి, తోట వీరయ్య, కొలిపాక శంకర్, కొండ వెంకటేష్, పెండ్లి నారాయణ ,కుందారపు సత్యం, పోలుదాసరి సాయి కుమార్, బొల్లాపల్లి శంకర్, మేకల ఎల్లయ్య, కొయ్యడ కుమార్, ముకీద్, తోట రాజ్ కుమార్, చిప్పకుర్తి శ్రీనివాస్, అగ్గిమల్ల నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గాలికొదిలిండ్రు..

**(మొదటిపేజీ తరువాయి)** జరుగుతున్న రాష్ట్రాల దండయాత్రకు వెళ్తున్నారు. ఇక్కడ ఏదేదో సాధించామనే రికార్డులను మోసుకెళ్లి అక్కడ పూసగుచ్చినట్టుగా వినిపించడానికి ఎవరికి వారుగా పోటీపడుతున్నారు. ఢిల్లీ పెద్దల ప్రశంసలు పొందడానికా.., లేదంటే తామేంటో చూపించుకునే అవకాశం ఇంత త్వరగా దొరుకుతుందనే ఊహించకనా.. ఇప్పుడు అంతా అందులో పండిపోతున్నారు.

### అంతా ఉత్తుత్తేనా..?

తెలంగాణలో హస్తం సర్కార్ పాలనకు త్వరలోనే ఏడాది పూర్తి కావస్తున్నది. ఇప్పటి వరకు చేపట్టిన ఒక్కటంటే ఒక్క కార్యం కూడా పూర్తిస్థాయిలో చేసింది లేదని ఇటు ప్రజలు అటు ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలకు పోతే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యమే చెల్లించుకునే ప్రమాదం కూడా లేకపోలేదని పలువురు పరిశీలకు కూడా బహిరంగంగానే పేర్కొంటున్నారు. అలాంటిది ఇక్కడ తామేదో పొడిచాము.. అన్నట్టుగా సర్కార్ బాధ్యులు ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఊకదంపుడు మాటలతో ఓటర్లను కట్టిపడేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలైనా బీజేపీ, బీఆఙఎస్ కూడా అదే స్థాయిలో కాంగ్రెస్ సర్కార్ ను నమ్ముకుంటే కొంపలు మునిగిపోవడం ఖాయమనే ప్రచారాన్ని కూడా విస్తృతంగా చేస్తున్నాయి. అక్కడి జనాలు నమ్ముతున్నారో., లేదో తెలియదుగానీ నేతల మధ్య మాటల యుద్ధం., హామీల చిట్టాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.

### ఎప్పుడూ అక్కడే..?

ఇప్పటికే మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు సార్లు వెళ్లారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. తెలంగాణ సర్కార్ సాధించిన విజయాలను పబ్లిసిటీ చేస్తూ పార్టీ కి ఓట్లు రాబట్టడానికి శ్రమిస్తున్నారు. అలాగే డిప్యూటీ సీఎం ప్రస్తుతం అక్కడే పాతుకుపోయారు. ఇక సీతక్క అటు ఇటు తిరుగుతూనే ఉంది. పొంగులేటి వరసగూడా అలాగే ఉండగా, ఉత్తమ్ వ్యవసాయ మంత్రి అయిఉండి కూడా అక్కడే పాతుకుపోయినంత పని చేస్తున్నారు. హెలీక్యాప్టర్ కోసం అలిగిన కోమటి రెడ్డి కూడా ప్రచారం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇలా సీఎం అండ్ మంత్రి వర్గమంతా అక్కడే పర్యటనల్లో ఉండడంతో రాష్ట్ర పాలన గాలికి పోతుందని జనం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

# మూసీల బోర్లుతాండ్లు..

**(మొదటిపేజీ తరువాయి)** స్పష్టంగా చెప్పలేంగానీ జనాలు మాత్రం అన్ని పార్టీల వేషాలు గమనిస్తూ ఏదైనా జరుగకపోతుందా అనే కోణంలో వెయిట్ అండ్ సీ అన్నట్టుగా ఉన్నారు.

### సవాల్.. ప్రతిసవాల్..

రాష్ట్ర రాజకీయాలు రోజు రోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. కొన్ని రోజులుగా మూసీ ప్రక్షాళన అంశం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అధికార ప్రతిపక్ష నేతల మధ్య ఘాటు విమర్శలు, జోరు సవాళ్లు నడుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే.. ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి ఓ సవాల్ విసరగా.. దాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వీకరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలు చేసే విమర్శలకు చాలా ఘాటుగా తిప్పికొడుతున్నారు.

### సవాల్ ఏందంటే..

మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ఇండ్లు కూల్చితే ఊరుకునేది లేదని పేదల ఇళ్లపైకి వచ్చే బుల్డోజర్లకు తాము అడ్డుగా ఉంటామంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్తూ వస్తుండగా.. దానికి రేవంత్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇలాంటి సందర్భంలోనే మూసీ ప్రక్షాళకు అడ్డొస్తే అడ్డొచ్చిన వాళ్లందరినీ బుల్డోజర్లతో తొక్కిస్తా అంటూ హాట్ కామెంట్స్ చేయటం సంచలనంగా మారింది. ఈ క్రమంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న పేదల కోసం పరితపించే ఆ ప్రతిపక్ష నేతలు వాళ్లు ఉంటున్న ప్రాంతాల్లో ఓ రెండు మూడు రోజులు ఉండి అంతా బాగానే ఉందని చెప్తే వెంటనే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేశారు. ముఖ్యంగా కేటీఆర్, హరీష్ రావు, ఈటల మూడు రోజులు ఉండాలని వారికి అయ్యే ఖర్చు కూడా తానే భరిస్తానని చెప్పుకొచ్చారు.

### స్వీకరించిన కేంద్ర మంత్రి..

అయితే, రేవంత్ రెడ్డి చేసిన ఈ ఛాలెంజ్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వీకరిస్తున్నట్టు ప్రకటించారు. ఇండ్లు కూల్చొద్దంటుంటే అడ్డమొచ్చినవారిని బుల్డోజర్లతో తొక్కిస్తానంటూ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని, పేదల కోసం చావటానికైనా సిద్ధమేనని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందులో భాగంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నిద్ర కార్యక్ర మం చేపట్టారు.శనివారం రాత్రి అంబర్‌పేట ప్రాంతంలోని తులసి రామ్ నగర్‌లో మూసీ పేదలు నివాసముంటున్న ప్రాంతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా.. ముఖ్య నేతలు బస్తీ నిద్ర చేశారు. కిషన్ రెడ్డితో పాటు, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కె. లక్ష్మణ్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఇతర నేతలు మూసీ పరివాహకంలోని 20 ప్రాంతాల్లో రాత్రి బస చేశారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం వరకు బీజేపీ నేతలు ఆయా ప్రాంతాల్లో బస చేశారు.

### ఇటు బీఆర్ఎస్..

బీఆర్ఎస్ నేతలు కూడా మూసీ పరీవాహక ప్రాంతాల్లో జోరుగా పర్యటించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు మూసీ బాధితులకు అండగా నిలిచారు. అయితే.. బీజేపీ నేతలు కేవలం పర్యటించటమే కాకుండా.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఛాలెంజ్‌ను కూడా స్వీకరించి.. బస్తీల్లో నిద్ర చేయటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరి బీజేపీ చేపడుతున్న ఈ బస్తీ నిద్రలను కూడా కాంగ్రెస్ తిప్పికొడుతుందా.. తర్వాత కార్యాచరణ ఏంటీ అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో వెలిగొండ నుంచి చార్మినార్ వరకు పాదయాత్ర చేయనున్నట్టు ప్రకటించనున్నారు.



### సీఎం కొత్త స్కెచ్..

మూసి విషయంలో బీఆర్ఎస్ రాజకీయాన్ని కాంగ్రెస్ నల్లగొండ సెంటిమెంట్ తో ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. దీనికి దీటుగా బీఆర్ఎస్ కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కార్యాచరణను రూపొందిస్తోంది. ఆరు నూరైనా మూసీ నది పునరుజ్జీవం కోసం ముందుకు వెళతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ఆ దిశలో వడివడిగా అడుగులు వేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మూసి పునర్జీవ సంకల్ప పాదయాత్రతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు పెంచింది. నల్లగొండ సెంటిమెంట్ ను పండించి.. బీఆర్ఎస్ కు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. వ్యూహాత్మకంగానే సీఎం రేవంత్ తన బర్త్ డే రోజున మూసీ పునర్జీవ సంకల్ప పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ నల్లగొండ సెంటిమెంటుకు దీటుగా బీఆర్ఎస్ మూసి ఎజెండాను సిద్ధం చేస్తోంది. మూసీ పాపం కాంగ్రెస్ దే అంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తుంది. నల్లగొండ సెంట్రిక్ గా మూసీ పునర్జీవనం కాంగ్రెస్ బీఆర్ఎస్ ల మధ్య పొలిటికల్ వార్ గా మారింది. ఈ సమయంలోనే మూసీ పునర్జీవనంపై కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ ల మధ్య రాజకీయ మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. సీఎం రేవంత్ పాల్గొన్న మూసి పునర్జీవ సంకల్ప యాత్రతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెరిగింది. మూసీ పునర్జీవ సంకల్ప యాత్ర పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు పెంచింది. మూసి ప్రక్షాళన చేసి తీరుతామని అధికార కాంగ్రెస్, అడ్డుకుంటామని బీఆర్ఎస్ ప్రకటించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల రాజకీయ యుద్ధం మొదలైంది. హైదరాబాద్ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ అగ్ర నేతలు విమర్శల దాడి చేస్తున్నారు. రేవంత్ సర్కార్ చేపట్టిన మూసీ పునర్జీవనంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు ఎక్కుపెట్టడంతో మూసీ ప్రకంపనలు.. ఇపుడు ఉమ్మడి నల్గొండ జిల్లాకు తాకాయి. మూసీనది ప్రక్షాళన, పునర్జీవనంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య పేలుతున్న మాటల తూటాలతో జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కింది.

### నల్లగొండ సెంటిమెంట్‌తో రాజకీయం..

రాష్ట్రంలో పొలిటికల్ వార్ గా మారిన మూసీ పునర్జీవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ గా తీసుకున్నారు. మూసీ రాజకీయాలు నల్గొండ సెంట్రిక్ గా మారాయి. మూసీ ప్రక్షాళనే తప్పు అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను సీఎం రేవంత్ తిప్పి కొట్టారు. జనవరి తొలివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి నుంచి పాదయాత్ర చేస్తానని రేవంత్ ప్రకటించారు. దీంతో మూసీ వివాదంపై బీఆర్ఎస్ కు చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్ నల్లగొండ సెంటిమెంటును ఎత్తుకున్నారు. మూసీ కాలుష్య మురుగు నీటితో అష్టకష్టాలు పడుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల బాధలు తెలుసుకునేందుకు నేరుగా రంగంలోకి దిగినట్లు ప్రచారం చేశారు. మూసి ప్రక్షాళనను వ్యతిరేకిస్తే అది నల్లగొండ ప్రజల్ని వ్యతిరేకించినట్లేనన్న సెంటిమెంటును తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోంది. మూసిని రాజకీయ అంశం చేసి సెంటిమెంట్ను రేపితే బీఆర్ఎస్ ను ఇరకాటంలో పడేయొచ్చని కాంగ్రెస్ ప్లాన్. అందుకే కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లాపై మూసీ అస్త్రం ప్రయోగిస్తోంది.

### మూసీ పాపం ఎవరిది..?

కాంగ్రెస్ సర్కారు ప్రయోగిస్తున్న మూసి అస్త్రాన్ని బీఆర్ఎస్ నేతలు తిప్పికొడుతున్నారు. తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని.. దానిలోని దోపిడీకే వ్యతిరేకమని బీఆర్ఎస్ రేవంత్ సర్కార్ పై విమర్శ దాడి కొనసాగిస్తోంది. అందుకే మూసి విషయంలో బీఆర్ఎస్ రాజకీయాన్ని కాంగ్రెస్ నల్లగొండ సెంటిమెంట్ తో ఎదుర్కొనాలని భావిస్తున్నది. దీనికి దీటుగా బీఆర్ఎస్ కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కార్యాచరణను రూపొందిస్తోందని సమాచారం. మూసి పాపం కాంగ్రెస్ దే అంటూ మూసి పరివాహక ప్రాంత ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు బీఆర్ఎస్ దండయాత్రకు సిద్ధమవుతోంది. ఉమ్మడి నల్గొండ నుండి మూసి పునర్జీవనంపై పోరును మరింత ఉధృతం చేయాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. బీఆర్ఎస్ అగ్ర నేతలు కేటిఆర్, హరీష్ రావులతో మూసి ఎజెండాగా జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని నేతల భావిస్తున్నారు.



### క్లైమాక్స్ కు యుద్ధం..

మూసీ కోసం యుద్ధం మరో లెవల్‌కు వెళ్లింది. కాషాయసేన కదం తొక్కుతోంది. సర్కార్‌కు ఛాలెంజ్ విసురుతోంది. మూసీ పునరుజ్జీవం అని ప్రభుత్వం అని ప్రభుత్వం అంటుంటే, ఆ పేరుతో ఇళ్లు కూల్చొద్దని బీజేపీ అంటోంది. మూసీ పునరుజ్జీవానికి అడ్డుపడితే బుల్డోజర్లతో తొక్కిస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరికలకు బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మూసి ప్రాంతం పేదలకు మనోధైర్యం కల్పిందేందుకు, వారికి అండగా ఉంటానని కిషన్ రెడ్డి ఘాటుగా రియాక్షన్ అయ్యారు.. సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కిషన్ రెడ్డి.. బుల్డోజర్లు వస్తే చావడానికైనా సిద్ధమేనని చెప్పారు. ఈ క్రమంలోనే మొన్న రేవంత్ పాదయాత్ర చేస్తే మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీజేపీ బస్తీ నిద్రకు దిగింది. ఇప్పటికే బీజేపీ నేతలు మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఇళ్ల కూల్చివేతను వ్యతిరేకించారు. తాము ఉన్నామంటూ ప్రజల తరపున కాషాయ నేతలు గళం విప్పారు. పేదల ఇళ్లు కూల్చొద్దని డిమాండ్ చేస్తున్న బీజేపీ .. మూసీ పునరుజ్జీవంపై సమగ్ర నివేదికకు పట్టు బడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సమయంలో మూసి వద్దా నిద్రపోగలరా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. దానికి తగినట్లుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నిద్ర కార్యక్రమం చేపట్టారు. దీంతో మూసీ ప్రక్షాళన చాటున రాజకీయం హీటెక్కినట్లుగా మారింది.

### వెయిట్.. అండ్ సీ...

మూసీ ప్రక్షాళన అని కాంగ్రెస్ సర్కార్ అంకురార్పణ చేసిన నుంచి బీఆర్ఎస్, బీజేపీ విరుచుకపడుతున్నాయి. పేదల ఇండ్లను ఇష్టారీతిగా తొలగించడానికి తాము పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంటూ సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా ఆ విషయంలో బీఆఙఎస్ ఓ అడుగు ముందే ఉంటూ తాము ముమ్మాటికి పేదల పక్షాన నిలుస్తామని తమ ప్రాణాలైనా అర్పించి సొంతింటి కల నెరవేర్చుకోవడానికి జీవితకాలాన్ని త్యాగం చేసిన వారికి మాత్రం లబ్ధి చేకూర్చే పనిలో ముందుంటామని గులాబీ నేతలు ప్రకటించారు. ఆ స్థాయిలో పోరాటాలు కూడా చేశారు. అప్పుడు కాస్తో కూస్తో ఖండనలు చేస్తూ, కాస్త వెనకబడినట్టుగా ఉన్న బీజేపీ మాత్రం ఈ మధ్యకాలంలో విపరీతంగా పుంజుకున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ దూకుడు పెంచిందానే చెప్పాలి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మూసీ నిద్రకు పిలుపునివ్వడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్ గా విపరీతంగా మాట్లాడుతున్నారు. దానికి తానేం తక్కువ కాదన్నట్టుగా ముఖ్యమంత్రి కూడా కౌంటర్లు ఇస్తూ పోటాపోటీగా ఆటను రక్తి కట్టిస్తున్నారు. ఇలా మూడు పార్టీల మధ్య మూసి మురిగిపోతుందా.., మంచేదైనా జరుగుతుందా అనేది తేలాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

# అన్నదాతలకు ప్రజా ప్రభుత్వం అండ..

- కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
- సోయాబీన్ సేకరణలో దేశంలోనే తెలంగాణ ఫస్ట్
- శనివారం ఒక్కరోజే 1,48,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఇప్పటిదాకా 1,64,191 టన్నుల పత్తి కొనుగోలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- సూర్యాపేట జిల్లా టేకుమట్లలో వరి కొనుగోలు కేంద్రం పరిశీలన



**జనపదం, సూర్యాపేట** : ప్రజా సంక్షేమంతో పాటు రైతు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, సోయాబిన్ సేకరణలో దేశంలోనే మొదటిస్థానంలో తెలంగాణ ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా టేకుమట్లలో ఐకేపీ నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడ రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వానా కాలం దిగుబడుల గురించి ఆరా తీయగా, దానికి రైతులు సరాసరి ఎకరానికి 40 బస్తాల కంటే ఎక్కువగానే దిగుబడి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టి అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగేలా చేస్తోందన్నారు. రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతు లందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రి యను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించా లని అధికారులను ఆదేశించారు. గతంలో పంటల ధాన్యాన్ని కల్లాల్లో పెట్టుకుని కొనుగోలు కోసం ఎదురుచూసే వారని, తమ ప్రభుత్వం 15రోజుల ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉందన్నారు. మిల్లర్లు కూడా తేమశాతం పట్టించుకోకుండా కల్లాల మీదనే కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్ కంటే కూడా అధిక ధర రావడంతో కొంతమంది రైతులు వాళ్ళకు అమ్ముతున్నట్లు తెలియజేశారు. దానికి మంత్రివర్యులు స్పందిస్తూ, ప్రభుత్వం సేకరించే ధాన్యం గోదాముల్లో నిల్వ ఉంచి, అవసరాలకు తగ్గట్లుగా బియ్యం పట్టిస్తారని, అప్పటిదాకా రంగు మారకుండా ఉండటానికి 17శాతం తేమ నిబంధన పాటించాల్సి ఉందని, మన ప్రజలకే నాణ్యమైన బియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా అందించడానికి ఆ నిబంధన పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతిమంగా ఈ ప్రజా ప్రభుత్వ ధ్యేయం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడమే అని, అది ప్రభుత్వ కొనుగోలు ద్వారానో, ప్రైవేట్ కొనుగోలు వలనా అన్నది తమకు అప్రాధాన్యమని తెలియజేశారు. మన రాష్ట్ర సన్నాలను ఇప్పుడు పొరుగు రాష్ట్రాలవారు వచ్చి మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయడం మన ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో వరికొయ్యలు తగుల బెడుతుండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయ శాఖ డైరెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వ్యవసాయశాఖ తరపున వచ్చే 15 రోజులు వరి కొయ్యలు తగులబెడ్తే వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే గ్రామ సభలలో తీర్మానాలు చేయించి దీనిని సంపూర్ణంగా అరికట్టాలన్నారు. జిల్లాలకు నియమించడిన ప్రత్యేకాధికారు లు, జిల్లా కలెక్టర్లు నిత్యం ధాన్యం, పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు. సోయా సేకరణలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని (29,134 క్వింటాళ్ళు, 142.53 కోట్లు) అలాగే నిన్నటి వరకు 1,82,149 మంది రైతుల వద్దనుండి 2851 కోట్ల విలువ గల 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రూ. 500 బోనస్ చెల్లింపులు చేస్తున్నామని, మద్దతు ధర డబ్బులు సివిల్ సప్లై సంస్థ రైతులకు నేరుగా చెల్లిస్తుందని, బోనస్ చెల్లింపులు మాత్రం ఆర్థిక శాఖ ద్వారా జరుగుతాయని, అందుకని 4,5 రోజులు ఆలస్యం జరుగుతుందని తెలియజేశారు . వ్యవసాయ శాఖ అధికారుల నివేదిక ప్రకారం నవంబర్ 3 వ వారం నాటికి 48%మేర (సుమారు 33 లక్షల ఎకరాలు ) వరి కోతలు పూర్తి అవుతాయని, నవంబర్ చివరి నాటికి ఇంకొక 21% (14 లక్షల ఎకరాలు ) కోతలు పూర్తికాగలదని అంచనా ఉన్నట్టు చెప్పారు. దానికి తగ్గట్లు వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేయడమైందని , మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ అధికారులు , రవాణా శాఖ అధికారులు పూర్తి సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. అలాగే రూ. 1206 కోట్ల విలువ గల 1,64,191 టన్నుల పత్తిని 6815 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసామని, రైతులకు అండగా ఉండి, కొనుగోళ్ళు సజావుగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారని మంత్రి తుమ్మల తెలియజేశారు.



## నేటి నుంచి నూతన ఈవీ పాలసీ..

- ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- రేపటి నుంచి అమల్లోకి..
- హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, సెక్రటేరియట్** : రాష్ట్రంలో సోమవారం నుంచి కొత్త ఎలక్ట్రికల్ వెహికల్స్ (ఈవీ) పాలసీ అమల్లోకి వస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మంత్రి పొన్నం మాట్లాడారు.. జీవో నెంబర్ 41 ద్వారా తీసుకొచ్చిన ఈవీ పాలసీ 2026 వరకు ఉంటుందన్నారు. తెలంగాణలో ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, ఆటో ట్రాన్స్ పోర్టు బస్సులకు వంద శాతం పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. పన్ను మినహాయింపు వలన వినియోగదారులకు ఏడాదికి సుమారు రూ.లక్ష మిగులుతాయని అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ఈవీ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ లో కూడా కాలుష్యం లేకుండా ఉండేందుకే ఈవీ పాలసీని తీసుకొచ్చామని మంత్రి పొన్నం పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మార్గదర్శకంలో హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామన్నారు. అందులో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన చెప్పారు. తెలంగాణను కాలుష్య రహితంగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు పై దృష్టి సారించాలని ప్రజలను ఆయన కోరారు.

## 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం..

- 19 న హన్మకొండలో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి : మంత్రి సీతక్క



**జనపదం, బ్యూరో** : రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తెలిపారు. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవన్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వాటిని పరిశీలించి ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు జారీ చేసిందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి భవన్‌లలో శిక్షణా కేంద్రం, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, కామన్ వర్క్ షెడ్, ఉత్పత్తుల ప్రదర్శన, సరస్ మేళాలు, జీవనోపాధి, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.5 కోట్లు చొప్పున మొత్తం రూ.110 కోట్ల అంచనా వ్యయంతో 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు మంజూర్యాయని తెలిపారు. ఈ ఏడాది 19న హన్మకొండ ఆర్ట్, సైన్స్ కాలేజీలో జరిగే ప్రజా పాలన విజయోత్సవ సభలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణాలకు శంకు స్థాపన చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికి 10 జిల్లా కేంద్రాల్లోనే జిల్లా మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 22 జిల్లాల్లో జిల్లా మహిళా సమాఖ్యల కోసం ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మిడ్ మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు..

- 4696 ఇండ్లు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు
- మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, రాజన్న సిరిసిల్ల** : మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తే మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి మాటిచ్చారని.. చెప్పినట్లుగానే నిర్వాసితుల కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు రిజర్వాయర్ కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు 4,696 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ అధికారుల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10,683 నిర్వాసిత కుటుంబాలకు తండాలతోపాటు 12 గ్రామాల్లో స్థలాలు అందించారు. మొత్తం నిర్వాసిత కుటుంబాలలో 5,987 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారని, మిగిలిన 4,696 కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పంపించారు. దీంతో కార్పొరేషన్ ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి అందిన ప్రతిపాదన ఆధారంగా ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది.

### ఇచ్చిన మాట ప్రకారం

గతంలో టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఉన్న సమయంలో మిడ్ మానేరు నిర్వాసితులకు అండగా ఉంటామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. హామీ ప్రకారం ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నారు. గతంలో మిడ్ మానేరు ముంపు గ్రామాల ఉద్యమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీన వేములవాడలో సీఎం రేవంత్ పర్యటనకు ముందే ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ముంపు గ్రామాల తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

## 19న ప్రజాపాలన విజయోత్సవ సభ

- దశాబ్ది నియంతృత్వ పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనలోకి వచ్చిన రాష్ట్రం
- ఒక్కొక్కటిగా ఆరు గ్యారంటీల అమలు...
- ప్రజా శ్రేయస్సు, వికాసమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ
- అటవీ,పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ
- బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపు



**జనపదం,హైదరాబాద్** : ప్రజలు నియంతృత్వ పాలనకు చరమగీతం పలికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకుని డిసెంబర్ 7 నాటికి ఏడాది పూర్తి కానున్న శుభ సందర్భంలో ఈనెల 19 న హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో తలపెట్టిన ప్రజా పాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పునరంకితమవుతోందని ఆమె స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, బడుగు, బలహీన వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం సహాయం రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంపు, రూ. 2 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు సాగుతున్నారని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యంగా మహిళా స్వయం సహాకయ సంఘాలకు వడ్డీలేని వేల కోట్ల రూపాయల రుణాలను అందిస్తూ వారి స్వయం సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని అన్నారు. ఇందిరమ్మ పేరు వినపడని, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు పొందని గ్రామమే వుండదని మంత్రి తేల్చి చెప్పారు. ఇందిరమ్మ సంక్షేమ పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తెచ్చిందని మంత్రి సురేఖ తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పరుగులు పెడుతున్నదని అన్నారు. ప్రజల శ్రేయస్సు, వికాసమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు రాహుల్ గాంధీ, సోనియా గాంధీల నిర్దేశకత్వంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సమర్థ కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. విజయోత్సవ సభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు సందేశానిస్తారని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## పథకాల అమలుపై కాంగ్రెస్‌వి 420 మాటలే..


- ఆరు గ్యారెంటీల పేరుతో ఆగం చేసిండ్లు..
- ఏడాది కావొస్తున్నా హామీలు నెరవేర్చలే..
- పథకాల అమలులో మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ విఫలం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**జనపదం, రామగిరి** : సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకులవి 420 మాటలేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాల్లో బాగంగా ఆదివారం కమాన్‌పూర్ మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికీ తిరిగి సంతకాలు పె ట్టి మరీ ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారని అన్నారు. వంద రోజులు పూర్తయి ఏడాది కావస్తున్నా ఆరు గ్యారెంటీలో ఒక్క మహిళల ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా..? అని ఆయనప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అందులో ఏ ఒక్కటి అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం ఏంటని ఆయన విమర్శించారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే పథకాల అమలులో విఫలం అయ్యారని, ఆనాడు కేవలం అధికారం, పదవుల కోసమే చూశారే తప్ప పేద ప్రజల సంక్షేమంపై ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అబద్దాలు అని, సన్నరకం ధాన్యంకు బోనస్ అంటూ రైతును మభ్యపెడుతున్నారని, ఇప్పటి వరకు రైతురుణమాఫీ వంద శాతం చేయలేదన్నారు. తెలంగాణాలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామంటూ మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని, ఇక్కడి తరహాలోనే మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలకులు ఇచ్చిన హామీలను మర్చి విజయోత్సవాలు జరుపుకోవాలని చూస్తున్నారని, అందుకు నిరసనగా కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజల సమస్యలు వదిలి ఒకరిపై ఒకరు ఆరోపణలు..

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**




**జనపదం, సూర్యాపేట** : ప్రజల సమస్యలు గాలికి వదిలి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలకు పరిమితమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రజలపై భారాలు చేస్తూ అన్ని వ్యవస్థలను బలహీనపరుస్తూ బడా, కార్పొరేట్ శక్తులు బాగు చేసే విధానాలు అనుసరిస్తుందని ఆరోపించారు. మరోపక్క ప్రతిపక్షాలపై అర్థంలేని విమర్శలు, స్థాయి లేని ఆరోపణ చేసుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. దీనివల్ల సకల జనులు అనేక కష్టనష్టాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఎన్నిక, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే పన్ను అనుకుంటూ ప్రజల మధ్య ఆర్థిక సమానతలు పెంచుతూ నూటికి 90 శాతం గా ఉన్న ప్రజల సంపద కొల్లగొట్టి 10 శాతంగా ఉన్న బడా, స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని అన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 300 రోజులు దాటిన మూడు వాగ్దానాలు మాత్రమే అమలు చేసిందని ఆరోపించారు. మిగతా హామీలు వెంటనే అమలుచేసి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో మంత్రి మండలి నేటికీ ఏర్పాటు నేటికీ చేయలేకపోయారని అన్నారు. రైతులకు రుణమాఫీఅందరికీ అమలు చేయలేకపోయారని అన్నారు. రైతు భరోసా,గిట్టుబాటు ధరవంటివి మర్చిపోయారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. పేదలకు ఇల్లు నిర్మించిన తర్వాతనే మూసి పరివాహ ప్రాంతాల్లో పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, మేదరమెట్ల వెంకటేశ్వరవు, మట్టి పెళ్లి సైదులు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.



## అవినీతిని నిరూపిస్తేనే తప్పుకుంటా..!

- నిరూపించకపోతే నువ్వు తప్పుకుంటావా ?
- రాజయ్యకు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం సవాల్
- టీఆర్ ఎస్ పదేళ్లు తెలంగాణను దోచుకుందని ఆరోపణలు

**జనపదం, స్టేషన్ ఘన్ పూర్** : అవినీతి, అక్రమాలకు పాల్పడ్డట్టు సాక్ష్యాధారాలతో నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని, ఒకవేళ నిరూపించ లేకపోతే, దళిత బంధు పేరుతో దళితులను ఎలా మోసం చేశావో సాక్షాధారాలతో ప్రజలు, మీడియా ముందు నిరూపిస్తే నువ్వు రాజకీయాలనుంచి తప్పుకుంటావా..? అని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు ఏమాత్రం ధైర్యం ఉన్నా ఈ సవాల్ ను ఒప్పుకోవాలని కడియం డిమాండ్ చేశారు. ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా, హనుమకొండలో నిర్వహించే మహిళా సదస్సు, బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో మండలాల వారీగా జన సమీకరణ పై నాయకులతో సమక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా బడ్జెట్లో రైతుల కోసం 72000 కోట్లను కేటాయించగా ఇప్పటికే 18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని, మిగిలిన 13 వేల కోట్లు డిసెంబర్ వరకు విడుదల చేస్తామన్నారు. రైతు భరోసాను కూడా త్వరలోనే ఇస్తామని చెప్పారు. ఆరు గ్యారెంటీలలో ఐదు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. అభివృద్ధికి 10 ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తే అందులో 6 మంజూరు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులం, 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు ఇచ్చిందన్నారు. నియోజకవర్గ కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఘనపూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఘనపూర్-నవాబ్ పేట, నష్కల్-పాలకుర్తి కాల్వ పనులు త్వరలో ప్రారంభం కానున్నయని అన్నారు. మల్లన్న గండి ఎత్తిపోతల ప్రాజెక్టు రెండు లిఫ్ట్ పనులను జూన్ లో పూర్తిచేసి ప్రజలకు గోదావరి నీళ్లు అందిస్తామని పేర్కొన్నారు. రఘునాథ్ పల్లి, వేలేరు మండలాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మజూరుతో పాటు చిల్పూర్ లో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 300 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలోని నిరుపేదలకు త్వరలో 6,000 వేల ఇందిరమ్మ ఇండ్లను అందించబోతున్నామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, చిల్పూర్ దేవస్థానం చైర్మన్ శ్రీధర్ రావు, చైర్మన్ ఐలయ్య, నరేందర్ రెడ్డి, వెంకన్న, వంశీధర్ రెడ్డి, శంకర్, రాజు, వెంకటయ్య, షకీల్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ..

- మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోకండి..
- నిరుద్యోగులకు మంత్రి దామోదర రాజ నర్సింహ సూచన



**జనపదం, హైదరాబాద్** : ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ నిరుద్యోగులకు సూచించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 11 నెలల్లోనే 7 వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. మరో 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 732 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టులు, 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు, 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంఎన్‌జే) పోస్టులు, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్లు వస్తాయన్నారు. విద్యార్హతలు, రాతపరీక్షలు ఇతర నిబంధన ప్రకారం పారదర్శకంగా ఈ పోస్టుల భర్తీ జరుగుతుందన్నారు. ఇందులో ఎలాంటి రాజీ లేదని, ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు ఇచ్చి, వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, మెడికల్ రిక్రూట్ మెంట్ బోర్డుకు మోసగాళ్ల సమాచారాన్ని అందజేయాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు.

# వర్గీకరణ అమలు ఎవ్వరూ అడ్డుకోలేరు

- ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైనది
- మాదిగ బిడ్డలు ఆందోళన చెందొద్దు
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**జనపదం, సూర్యాపేట:** సీఎం రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల పక్షపాతని, మాదిగలకు రేవంత్ రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం నాడు జిల్లా కేంద్రం లోని శ్రీలక్ష్మి గార్డెన్స్ జరిగిన ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై సూర్యాపేట జిల్లా మాదిగల సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల వర్గీకరణ పోరాటం మూడు దశాబ్దాల నుంచి జరుగుతుందని, దేశపు అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అన్నారు. ఏబీసీడీ వర్గీకరణ ద్వారా దళితులలోని పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల పక్షపాతని ఆయన చెప్పారు. ఉస్మానియా మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టారని, పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ను నియమించారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి ఏబీసీడీ వర్గీకరణ పై అసెంబ్లీలో ప్రకటన చేసిన దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన అన్నారు. మాదిగ జాతి ఘనమైన చరిత్ర కలిగిన జాతని అయన అన్నారు. మాదిగ జాతి మహోన్నతమైన చరిత్ర కలిగిన జాతని అన్నారు. చెప్పులు కుట్టింది, డప్పుకు కొట్టి సమాచారం చేరవేసింది తామే అని ఆయన అన్నారు. మిలటరీలో జవాన్లకు బూట్లు తయారు చేసిన చరిత్ర మాదిగలదని ఆయన అన్నారు. ఏబీసీడీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, సుప్రీంకోర్టు తీర్పును మాలలు గౌరవించాలని అన్నారు. వర్గీకరణ అమలుకై రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా కమిటీని నియమించిందని, ఈ కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు సభ్యులు గా ఉన్నారని ఆయన అన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ లను కలిసి ఎస్సీ వర్గీకరణ అమలుకు మద్దతు ఇవ్వాలని కోరతానని చెప్పారు. ఎస్సిలలోని ఉప కులాలకు, పేదలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ అమలు జరగాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ అనసూయ రాములు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, కందుకూరి లక్ష్మయ్య, చిప్పలపల్లి యాదగిరి, రెబల్ శ్రీను, వల్దాసు దేవేందర్, పాలడుగు పరశురాం, గుడిపాటి సైదులు, కడియం పరమేష్, వీరస్వామి, దాసరి శ్రీను, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.





# చుక్కలు చూపుతున్న సురేశ్..?

- సవాల్గా మారిన లగచర్ల ఘటన ప్రధాన నిందితుడి ఆచూకీ
- గాలిస్తున్నా.. చిక్కట్లే...
- తప్పిస్తున్నది ఎవరు అనేది అంతు చిక్కని ప్రశ్న..
- పక్కా ప్రణాళిక ప్రకారమేనా అనే అనుమానాలు..
- పోలీసులకు ముచ్చెమటలు

**జనపదం, వికారాబాద్ :** లగచర్లలో అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడు బోగమోని సురేశ్ ఆచూకీ కనిపెట్టడం పోలీసులకు ఛాలెంజ్గా మారింది. దాడి జరిగిన వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిన అతడి ఆచూకీని ఆరు రోజులు దాటినా పోలీసులు కనిపెట్టలేకపోయారు. మహారాష్ట్రలోని పుణె ప్రాంతంలో తలదాచుకుని ఉంటాడని ఒక ప్రచారం ఉండగా హైదరాబాద్లోనే రహస్య ప్రదేశంలో దాగి ఉంటాడని మరో ప్రచారం జరుగుతోంది. ఓ పార్టీ నేతలు అతడిని పక్కా ప్రణాళికతో అజ్ఞాతంలోని పంపించి ఉంటారని, సెల్ఫోన్ సైతం అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకుని ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో పాటు ఆ నేతకు కుట్రలో భాగముందా..? అనే విషయం తెలుసుకునేందుకు సురేశ్ను విచారించడమే కీలకంగా మారింది. అయితే అతను పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంలో ఉన్నాడు. సురేశ్ చిక్కితేనే ఈ ఘటనకు బాధ్యులు ఎవరనేది స్పష్టంగా తెలుస్తోంది. కలెక్టర్ బృందాన్ని ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద నుంచి ఊరిలోను తీసుకెళ్లడంలో సురేశ్ కీలకంగా వ్యవహరించాడు. అక్కడికి వెళ్లిన వెంటనే ఆందోళనకారులు నినాదాలు చేస్తూ ముందుకు దూసుకురావడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో అక్కడే ఉన్న సురేశ్ సైతం నినాదాలు చేసినట్లు వీడియోలో కనిపించడంతో ఆయనే పక్కా ప్లాన్తో అధికారులను అక్కడికి రప్పించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

**ముందే ప్లాన్ చేసి ఉంటారని అనుమానం..**

**అధికారులు వచ్చేసరికే వారిని రెచ్చగొట్టి దాడికి సిద్ధం చేసి ఉంటాడని కలెక్టర్ వాహనం దిగిన క్షణాల వ్యవధిలోనే అందోళనకారులు ఆయనపైకి దూసుకు రావడంతో పాటు వెంకట్రెడ్డిని వెంటాడి కొట్టేందుకు అదే కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి సెల్ఫోన్ను విశ్లేషించడంతో పాటు సురేశ్ వాంగ్మూలం కీలకమవుతుందని యోచిస్తున్నారు. సురేశ్ అరెస్టయితే కానీ కేసు దర్యాప్తు వేగవంతం కాదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు ఈ ఘటనకు సంబంధించి 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్నం నరేందర్ రెడ్డితో కలిపి మొత్తం 21 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్కు పంపించారు.**

## అన్నదాతలందరికీ అభినందనలు..

- మీ కష్టం వెలకట్టలేనిది..
- సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే ఈ ఘనత సాధించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలనే రాష్ట్రంలో వరి పంట సాగు పెరిగిందనే బీఆర్ఎస్ నేతల ప్రచారం పటాపంచలైందన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పోస్టు చేశారు. రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి సాధించిన తెలంగాణ రైతాంగం దేశానికే గర్వకారణం అన్నారు. అత్యధిక దిగుబడి సాధించేందుకు శ్రమించిన ప్రతి అన్నదాతను అభినందిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

# వరిలో రికార్డు..

- దిగుబడిలో తెలంగాణ టాప్..
- 66.77 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి
- ముమ్మాటికీ మాది రైతు పక్షపాతి ప్రభుత్వమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అన్నదాతలందరికీ అభినందనలు..
- మీ కష్టం వెలకట్టలేనిది..
- సీఎం రేవంత్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ సిటీ:** వరి దిగుబడిలో తెలంగాణా రికార్డ్ సృష్టించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తే 153 లక్షల ధాన్యం దిగుబడి రావడం తెలంగాణా రైతాంగం సాధించిన ఘన విజయం అన్నారు. ప్రస్తుతం ఏఐసీసీ మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే తెలంగాణలోని ధాన్యం దిగుబడి పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ళు, దిగుబడి గురించి అధికారులను మంత్రి ఉత్తమ్ ఆరా తీశారు. అత్యధికంగా ధాన్యం దిగుబడి సాధించిన ఘతన ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందంటూ ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు చెందిన మూడు బ్యారేజీలు పనిచేయకపోయినా ధాన్యం దిగుబడిలో సాధించిన రికార్డు తమ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. తమది ముమ్మాటికీ రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందడానికి రికార్డు స్థాయిలో పండిన వరి పంట నిదర్శనమని అన్నారు. తెలంగాణ చరిత్రలోనే కాకుండా యావత్ భారత దేశంలోనే ఇంతటి ధాన్యం దిగుపడి అరుదైన రికార్డు అని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ తెలంగాణ ప్రాంతంలో ఇంతటి పంట పండిన సందర్భం లేదన్నారు. ప్రభుత్వంతో మమేకమైన రైతాంగం అంకితభావంతో చేసిన సాగు తోనే ఇది సాధ్యపడిందని, అందుకు రాష్ట్ర రైతాంగానికి అభినందనలు తెలిపారు.

# కమలమోళ్ల కండ్లకు పొరలు..

- మూసీ ప్రక్షాళన బీజేపీకి ఇష్టం లేదు
- గుజరాత్ గులాం.. కిషన్ రెడ్డి..
- పార్టీ ఆయనను వాడుకుంటోంది
- సబర్మతి ప్రక్షాళనప్పుడు ఎందుకు మాట్లాడలేదు..?
- ఎవరు అడ్డుకున్నా పునర్జీవం ఆగదు
- మహారాష్ట్రను దోచుకునేందుకు గుజరాతీలు వస్తున్నారు
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి



**జనపదం, బ్యూరో:** కేంద్రమంత్రి కిషన్రెడ్డి మూసీ ప్రక్షాళన విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, సబర్మతి నది ప్రక్షాళన చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పి కొట్టారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డిని గుజరాత్ కా గులామ్గా అభివర్ణించారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ అభివృద్ధి చెందడాన్ని ఓర్వలేకపోతున్నాడంటూ విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (ఉద్ధవ్ థాకరే)- నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్)- కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నాగ్పూర్లో ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నాయకులు చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమంలో కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే నిందలు వేస్తున్నారంటూ ఆరోపించారు. గుజరాత్లో సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తే కిషన్ రెడ్డి చప్పట్లు కొట్టి హర్షం వ్యక్తం చేశారని, ఆ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం 50,000 మందిని, 15 వేల కుటుంబాలను తరలించిందని గుర్తు చేశారు. అలాంటి ప్రాజెక్టే తాము చేపడితే విమర్శలు గుప్పిస్తున్నాడని, దీన్ని వ్యతిరేకిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి గుజరాత్కు గులాంలా మారినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుజరాత్ మోడల్కు ధీటుగా తెలంగాణ మోడల్ అభివృద్ధి చెందుతోందని, ఇది దేశానికే రోల్ మోడల్ అవుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో తన సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశం మొత్తానికీ ఆదర్శవంతమవుతాయని, గుజరాత్ మోడల్ ఘోరంగా విఫలమవుతుందని చెప్పారు. కిషన్ రెడ్డి సహా తెలంగాణ బీజేపీ నాయకులు ఏమనుకున్నా గానీ మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్తామని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ను నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్గా నిలుపుతామని స్పష్టం చేశారు.

**గుజరాత్ మోడల్ ఫెయిల్ అయిందా...?**

ఈ సందర్భంగా మోదీ, అదానీపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ నుంచి ప్రధాని, అదానీ ముంబైను దోచుకోవడానికి వస్తున్నారంటూ ఆరోపించారు. బీజేపీ బందిపోటు ముఠాను తరిమికొట్టాలని మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ వెన్నుపోటు రాజకీయాలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అలాంటి బీజేపీని ఈ ఎన్నికల్లో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మూసీ నదిని బాగుచేయడం బీజేపీ నేతలకు ఇష్టం లేదని, ఎవరు అడ్డుకున్నా మూసీ పునరుజ్జీవం ఆగేది లేదని స్పష్టంచేశారు.

మూసీ ప్రాజెక్టు వద్దు అంటున్నారంటే గుజరాత్ మోడల్ ఫెయిల్ అయ్యిందా? అని కిషన్ రెడ్డికి సూటిప్రశ్న వేశారు. మూసీని బాగు చేయడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు బీజేపీ షిండేను వాడుకుందని, అలాగే తెలంగాణలో కిషన్ రెడ్డి వాడుకుంటున్నారని చెప్పారు. పదకొండేళ్లలో ప్రధాని మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. రైతులకు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ హామీ ఏమైందని అన్నారు. మహారాష్ట్రను దోచుకునేందుకు ఇద్దరు గుజరాతీలు వచ్చారని, ధారావి ప్రాజెక్టు ద్వారా పెద్ద మొత్తంలో దోచుకోవాలని బీజేపీ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. వారికి అవకాశం ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 కంపెనీలను మోడీ గుజరాత్ కు తీసుకువెళ్లారని, మహాయతికి గుణపాఠం చెప్పేందుకు రైతులు, పేదలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# చావులకు కారణమెవరు..?

- యువతను కాపాడే బాధ్యత ప్రభుత్వానికి కదా..?
- గురుకులాల్లో విద్యార్థుల మృత్యు ఘోష
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం
- దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచన..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతోందని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా, ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, గడిచిన 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుస్థితి అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి, కానీ చేతలు మాత్రం గడప దాటడం లేదని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం రోజు సీఎం ప్రగల్బాలు పలకడం తప్ప ఎలాంటి కార్యచరణకు దిక్కులేకుండా పోయిందన్నారు.

సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడడం శోచనీయమన్నారు. ఈ చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని, దీనికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వాంకిడిలో గురుకులంలో పాఠాలు వినాల్సిన విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్ లో వెంటిలేటర్పై కొట్టుమిట్టాడుతున్నదని, దానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలనుకున్న బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవరని నిలదీశారు. సంగారెడ్డి బీసీ గురుకులంలో ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి ఆత్మహత్యకు కారణం ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. ఇలా చెప్పుకుంటూ పోతే గురుకులాలలో 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ మరణాలకు కారణం ఎవరో ప్రభుత్వమే చెప్పాలన్నారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ లోనూ ఇదే దుస్థితి కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఘనత వహించిన కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడలుగా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకి దిగజారిపోతుండడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారాయన్నారు. విద్యాశాఖతో పాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖలు నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం, అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పరిస్థితే ఇలా ఉంటే, ఇక మిగతా శాఖల పనితీరు గురించి చెప్పాల్సిన పనిలేదన్నారు. ఈ చావులకు ప్రభుత్వం బాధ్యత వహించి, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





# తెలంగాణ సంస్కృతికి చిహ్నం సదర్..

- ఉత్సవాలతో కులాల మధ్య ఐక్యత
- వారసత్వంగా భవిష్యత్ తరాలకు అందివ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**జనపదం, సిద్ధిపేట :** తెలంగాణ సంస్కృతికి చిహ్నం సదర్ అని, ఉత్సవాలతో కులాలు, జాతి మధ్య ఐక్యత పెంపొందుతుందని, దానిని వారసత్వంగా భవిష్యత్ తరాలకు అందివ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు చాలా ప్రత్యేకతలు ఉన్నాయని, ప్రపంచంలో పూలను పూజించే పండగ ఒక్క తెలంగాణలో ఉందన్నారు. అలాగే అమ్మవారి కోసం ఎంతో గొప్పగా నిర్వహించే పండుగ బోనాలు కూడా హైదరాబాద్‌కే సొంతమన్నారు. అడవి జంతువులను సాదు జంతువులుగా మార్చిన ఘనత యాదవులదని, ప్రపంచానికి పాలను అందిస్తూ యాదవులు సేవ చేస్తున్నారని కొనియాడారు. దున్నపోతులను గౌరవించి, పండుగ జరిపే సంస్కృతి కూడా కేవలం తెలంగాణకే సొంతమన్నారు. బతుకమ్మ.. బోనాలు..సదర్ ఇలా అనేక ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి గొప్ప చిహ్నం అన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, యాదవులకు లీటర్‌కు ఇన్‌సెంటివ్ స్కీం రూ.4 ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ మేం వచ్చిన ఏడాదిలో ఎం తక్కువ చేశామని మాట్లాడుతున్నారని, ఆయన వచ్చాకే పథకాలన్నీ బంద్ అయ్యాయన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, యాదవులకు గొర్రె పిల్లల పంపిణీ ఇలా బోలెడు పథకం బంద్ చేశాడన్నారు. రేవంత్ సీఎం అయ్యాక చేసిన మంచి చేసిందేమీ లేదని, అయితే తిట్లు.. లేకపోతే దేవుడి మీద ఒట్లు తప్ప పెద్దగా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండి మాట్లాడటం కాదు..సిద్దిపేట గల్లీలోకి వచ్చి అడుగు, ఈ రాష్ట్రంలోని పల్లెలకు వచ్చి అడుగు.. ఏం తక్కువైందో ప్రజలు చెబుతారన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పోయిందని, అన్ని వర్గాల ప్రజలు రేవంత్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఉత్సవాల్లో స్థానిక యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# వారెవ్వా.. తోడు దొంగల నాటకం..

- రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా కమలదళం
- దోస్తును కాపాడేందుకు 'చీకటి' రాజకీయం
- ఎక్స్ వేదికగా కేటీఆర్ ధ్వజం..
- ఇన్నాళ్లకు మూసీ బాధితుల ఆక్రందనలు గుర్తొచ్చాయా.. అని విమర్శ..



**జనపదం, బ్యూరో:** వారెవ్వా.. తోడు దొంగల నాటకం ఇది.., భలేగా ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్, బీజేపీలపై సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా కమలదళం నిలుస్తోందని ఆరోపించారు. దోస్తును కాపాడేందుకు కమళదళం 'చీకటి' రాజకీయం చేస్తుందని ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇప్పుడు మూసీ బాధితుల ఆక్రందనలు గుర్తొచ్చాయా..? అని ప్రశ్నించారు. ఇదంతా లగచర్ల ఘటన డైవర్షన్ కోసం కాదా మీ మూసీ నిద్ర..? అని మండిపడ్డారు. హైడ్రాను మొదట స్వాగతించిందే కిషన్ రెడ్డి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బుల్డోజర్ లను అడ్డుకుంటామన్నది మేము అని కేటీఆర్ పేర్కొన్నారు. అయినా అకస్మాత్తుగా మూసీ బాధితులు గుర్తుకు రావడానికి వెనుకున్న మతలబేంటి..? ఎవరిని కాపాడటం కోసం..? ఎవరిని ముంచడం కోసం..? మరెవరిని వంచించడం కోసమో... చెప్పాలని కిషన్ రెడ్డిని నిలదీశారు. రేవంత్ ను కాపాడటం కోసమే ఈ డైవర్షన్ డ్రామాలని, లగచర్ల రైతులకు తెలంగాణ బీజేపీ పంగనామాలని మండిపడ్డారు. మీ పాలి'ట్రిక్స్' ను తెలంగాణ గమనిస్తోందని, సరైన వేళ ఆటకట్టిస్తోందని వ్యాఖ్యానించారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com